క్లుప్తంగా

వాసవీమాతకు ఘనంగా సారె



గోకవరంలో సారెతో ర్యాలీ చేస్తున్న మహిళలు

గోకవరం: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని గోకవరంలోని వాసవీమాతకు వాసవీ ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సారెను సమర్పించారు. 108 రకాల పిండి వంటలు, స్వీట్లు, పండ్లతో మహిళా సంఘం సభ్యులు గ్రామంలో ర్యాలీగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అంతకు ముందు సద్ది అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 102 గోత్రాలతో చేయించిన వెండి కాయిన్ల హారాన్ని సంఘం సభ్యులు అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం



బాధితులకు సాయం అందజేస్తున్న నాయకులు

గోకవరం: తంటికొండ గ్రామంలో తాటాకిల్లు దగ్ధమైంది. శనివారం అర్ధరాత్రి వృద్ధుడు నెక్కిన చక్రయ్యకు చెందిన తాటాకింటి నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే స్థానికులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. ఆ మంటల్లో చిక్కుకున్న వృద్ధుడు చక్రయ్యను బయటకు తీసుకురావడంతో స్వల్పగాయాలతో బయటపడ్డారు. అగ్ని ప్రమాద బాధితులకు స్థానిక సర్పంచ్ బద్దిరెడ్డి సత్యనారాయణమ్మ, దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి రెడ్డి, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు బద్దిరెడ్డి అప్పన్నదొరలు పరామర్శించి నగదు, నిత్యావసర సరుకులు అందజేశారు. బాధితులను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు సైతం బాధితులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు.

దాతల సేవలు ప్రశంసనీయం



ఏలేశ్వరంలో మహిళలకు చీరలు అందజేస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ఏలేశ్వరం: దాతల సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. పట్టణంలోని శ్రీదేవిభూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం(బాలాజీచౌక్) ధర్మకర్త గోపువెంకట్రావు, సుబ్బలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే చేతులమీదుగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. స్థానిక బాలాజీచౌక్ వద్ద సుమారు వెయ్యి మందికి చీరలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దాతలు వెంకట్రావు, సుబ్బలక్ష్మి దంపతులు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

సాగుదారులకు పట్టాలివ్వాలి

జగ్గంపేట: గుర్రంపాలెం సీలింగ్ భూములకు తక్షణం పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో పేదలు గుర్రంపాలెం గ్రామం వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఏపీఆర్‌సీఎస్ రాష్ట్ర నాయకులు దుర్గారావు మాట్లాడుతూ గుర్రంపాలెం సీలింగ్ భూములను వెంటనే పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు, లేకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఆర్‌సీఎస్ డివిజన్ కార్యదర్శి దేశెట్టి సురేష్, నారాయణమూర్తి, చేదులూరి లక్ష్మి, వడ్లమూడి ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల విజయోత్సవ ర్యాలీ

తుని: మూడు రాష్ట్రాల్లో బీజేపీ విజయదందిబి మోగించడంతో స్థానిక బీజేపీ శ్రేణులు ఆదివారం సాయంత్రం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పార్టీ నాయకులు ప్రజలకు స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు. యువమోర్చా పాలసీ అండ్ రీసెర్చ్ సెల్ స్టేట్ కన్వీనరు అనిరుద్‌వర్మ, తుని నియోజవకవర్గ కన్వీనరు వెలుగుల గోపాలకృష్ణ, పట్టణ ప్రధాన కార్యదర్శి కాదంబరి రామకృష్ణ, నియోజకవర్గ కో కన్వీనర్ లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయోత్సవం

ప్రత్తిపాడు: తెలంగాణా ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయదుంధుబి మోగించడంతో ప్రత్తిపాడులో ఆ పార్టీ కార్యకర్తలు ఆదివారం సాయంత్రం విజయోత్సవాలు జరుపుకొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద పీసీసీ సభ్యుడు ధరణాల కోట శ్రీను అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ కోఆర్డినేటర్, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఉమ్మిడి వెంకట్రావు పాల్గొని మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కష్టపడి పని చేయాలన్నారు. పార్టీ కార్యాలయం నుంచి మెయిన్‌రోడ్డు, మార్కెట్ సెంటర్, అల్లూరి జంక్షన్ మీదుగా స్థానిక అంబేడ్కర్ కళామందిర్ వరకు తీన్‌మార్ వాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ ర్యాలీ నిర్వహించారు. అందరికీ మిఠాయిలు పంచారు. పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

రైతన్నకు శాశ్వత హక్కు

- దశాబ్దాల కష్టానికి సంపూర్ణ భూహక్కు
- మొదటి విడతలో 993 మందికి ప్రయోజనం
- ఇక క్రయవిక్రయాలు, వారసులకు బదలాయింపు సులభతరం



చామవరంలో జిరాయితీ భూమిగా మారిన డీ పట్టా భూములు



సంపూర్ణ భూహక్కు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన సర్టిఫికెట్

తుని రూరల్ : కొండలను చదును చేసి పంటలు పండించిన జీవితాన్ని సాగించే కష్టజీవులను వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం గుర్తించింది. కొండపోడు భూములు, సీలింగ్ భూములు, ఇతరేతర ప్రభుత్వ భూములను నమ్ముకుని దశాబ్దాలుగా వేలాది ఎకరాల్లో సాగు చేస్తున్న భూములపై సాగుదారులకు ప్రభుత్వం సంపూర్ణ హక్కులు కల్పించింది. దీంతో తుని పట్టణం, తుని, కోటనందూరు, తొండంగి మండలాల్లో మొదటి విడతలో ప్రత్యక్షంగా 993 మందికి, పరోక్షంగా వేలాది మందికి ప్రయోజనం చేకూరింది. తాతలు, తండ్రుల కాలం చేసినా సాగులో ఉన్న భూములు తమ పేరున బదలాయించలేదని, కష్టకాలంలో ఆదుకోవడంలేదని సాగుదారులు, వారసులు ఇన్నాళ్లు ఆవేదన చెందారు. సీఎం సాహసోపేతంగా తీసుకున్న నిర్ణయంతో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దేశంలో తమిళనాడు తర్వాత ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ప్రయోజనం కలుగుతుంది.

ఇదీ పరిస్థితి

కొన్నేళ్లగా నియోజకవర్గంలో వేలాది మంది కొండ పోడు భూములు, సీలింగ్ భూములు, జిరాయితీయేతర భూములను సాగు చేస్తున్నారు. దశాబ్దాలు గడచినప్పటికీ ఆయా భూములపై హక్కులు లేకపోడంతో అత్యవసరంలో రుణాలు, క్రయ విక్రయాలు, వారసులకు బదిలీ చేసుకునేందుకు వీలుపడలేదు. దీంతో విలువైన భూములు సైతం అనాధికారకంగా తక్కువ ధరకు క్రయ విక్రయాలు జరిగేవి. కష్టపడి సాగు చేసుకునేవారికి రుణాలు అందక అధిక వడ్డీలకు అప్పులు చేసి వ్యవసాయంపై పెట్టుబడి పెట్టేవారు. ఇలా పేదల కష్టార్జితం దళారుల పాలయ్యేది. సంపూర్ణ భూహక్కుతో పరిస్థితులు పూర్తిగా మారనున్నాయి. 2003కి ముందు వేర్వేరు ప్రభుత్వాలు డి.పట్టాలు ఇచ్చిన భూములకు సంపూర్ణ భూహక్కు పత్రాలు, ఆ తర్వాత సాగు చేసుకున్న పోడు భూములు డి.పట్టాలను ఇచ్చే కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీంతో ఆయా హక్కుదారులకు ప్రాంతాలను బట్టి రూ.15 లక్షల నుంచి రూ.కోటి వరకు ఆస్తి దక్కినట్టయ్యింది. తుని పట్టణంలో 48 మంది, తుని మండలంలో (ఆరు) గ్రామాలకు చెందిన 164 మంది, తొండంగి మండలంలో 220 మంది, కోటనందూరు మండలంలో 561 మందికి సంపూర్ణ భూ హక్కులు లభించాయి. మలి విడతలో వేలాది మందికి లబ్ధి చేకూరనుంది.

ఎన్నో ఏళ్లుగా సాగు చేస్తున్నా..



కొండపోడు సాగుతో నా కుటుంబం జీవిస్తున్నాం. ఎన్నో ఏళ్లగా సాగు చేస్తున్నా ఎటువంటి పత్రాలు లేకపోవడంతో ప్రభుత్వాలు మారినప్పుడు భయంతో ఉండాల్సి వచ్చేది. ఇప్పుడు సీఎం జగన్మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన చట్టంతో కొండపోడు భూమికి డి.పట్టా లభించింది. ధైర్యంగా పంటసాగు చేసుకునే హక్కు లభించింది.

– వై.లక్ష్మి, డి.పట్టా లబ్ధిదారు, మారువాడ

భూమిపై సంపూర్ణ హక్కు



డి.పట్టాతో మా తాత, మా తండ్రి సాగు చేసిన భూమిపై నాకు సంపూర్ణ భూహక్కు లభించాయి. ఇప్పటి వరకు సాగు చేసుకుని ఫలసాయాన్నే పొందాం. సంపూర్ణ భూ హక్కుతో పంట రుణాలు, నా తర్వాత వారసులకు భూ బదలాయింపునకు సులభమయ్యింది. ఈ ఘనత సీఎం జగన్‌కే దక్కింది.

– ఎం.రామచంద్రరావు, జిరాయితీ పట్టా లబ్ధిదారుడు, రాపాక

స్వాతంత్ర్యం తర్వాత ఇదే తొలిసారి



స్వాతంత్రం వచ్చిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో సీలింగ్, కొండ పోడు, జిరాయితీయేతర భూములపై సాగుదారులకు సంపూర్ణ భూ హక్కు కల్పించడం ఇదే తొలిసారి. ఇటువంటి చట్టం దేశంలో తమిళనాడు తర్వాత ఏపీలోనే అమలవుతుంది. తుని మండలంలో మొదటి విడతలో 212 మందికి ప్రయోజనం దక్కింది. 2003కి ముందు డి.పట్టాలు పొందిన సాగుదారులకు, వారసులకు సంపూర్ణ భూహక్కు పత్రాలు దశలవారీగా అందిస్తాం.

– ఎస్.శివకుమార్, తహసీల్దార్, తుని

సత్యదేవుని సన్నిధిలో మంత్రి ముత్యాలనాయుడు



వేదపండితుల ఆశీస్సులు పొందుతున్న మంత్రి బూడి ముత్యాలనాయుడు

అన్నవరం: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాల నాయుడు ఆదివారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు పండితులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందచేయగా, స్వామి వారి ప్రసాదాలను దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ అందచేశారు. అన్నవరం సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్ రాజా, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ మంత్రి ముత్యాలనాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

ఏలేశ్వరం: దివ్యాంగుల దినోత్సవం పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కౌన్సిలర్ మూదినారాయణస్వామి ఆధ్వర్యంలో దివ్యాంగులు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు సమాజంలో సమన్యాయం కల్పించాలన్నారు. అన్నిరంగాల్లో వారు రాణించాలన్నారు.

భగవద్గీత పోటీలు

ఏలేశ్వరం: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం భగవద్గీత పోటీలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా నిర్వహించిన పోటీల్లో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాబోలుదేవి, ఉడతల రమణారావు, కటకం కిరిటీ పాల్గొన్నారు.

ఓటు నమోదు కేంద్రాల పరిశీలన



ప్రత్తిపాడులో శిబిరాన్ని తనిఖీ చేస్తున్న శ్రీనివాసరావు

ఏలేశ్వరం: అర్హత ఉన్న వారు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీనివాసరావు సూచించారు. ఎన్నికల సంఘం రెండురోజుల పాటు ప్రత్యేక శిబిరాల ఏర్పాటులో భాగంగా ఆదివారం పట్టణంలో ప్రత్యేక క్యాంపును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటును నమోదు చేసుకోవాలన్నారు. ఓటరు లిస్టులో ఎమైనా తప్పులు ఉంటే సరి చేసుకోవాలని చెప్పారు. వచ్చే 2024 జనవరికి 18 ఏళ్లు నిండిన వారు ఓటునమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కెశ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కోటనందూరు: మండలంలోని టీజే నగరం, ఇండుగపల్లి, బిళ్లనందూరు, ఎస్సార్‌పేట, భీమవరపుకోట, జగన్నాధపురం, కోటనందూరు గ్రామాల్లో ఓటు నమోదు ప్రత్యేక శిభిరాలను తహసీల్దార్ కె.కుశరాజు ఆదివారం పరిశీలించారు. దరఖాస్తుదారుల నుంచి వచ్చిన ఓటు నమోదు ఫాంలను పరిశీలించారు.

ప్రత్తిపాడు: త్తిపాడు నియోజకవర్గంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాల్లో 1,015 దరఖాస్తులు అందినట్టు బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్, నియోజకవర్గ ఎన్నికల ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎ.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన ఆదివారం నియోజకవర్గంలోని పలు ఓటరు నమోదు ప్రత్యేక శిబిరాలను ఆకస్మిక తనిఖీ చేశారు. నియోజవర్గంలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాలు, ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలో రెండు రోజుల పాటు నిర్వహించిన 227 ఓటరు నమోదు ప్రత్యేక శిబిరాల్లో 1,015 దరఖాస్తులు అందాయన్నారు. తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

తొండంగి: మండలంలోని ఓటరు నమోదు కేంద్రాలకు ప్రజల నుంచి 349 దరఖాస్తులందాయని తహసీల్దార్ జి.సుబ్రహ్మణ్యం ఆదివారం తెలిపారు. మండలంలోని రావికంపాడు, బెండపూడి, వేమవరం, ఎ.వి.నగరం, ఎ.కొత్తపల్లి తదితర ప్రాంతాల్లో ఓటరు నమోదు కేంద్రాలను పరిశీలించారు. మండల వ్యాప్తంగా 22 పంచాయతీల్లో 72 కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించామన్నారు. మొత్తం 349 వచ్చాయని, వీటిని పరిశీలించి ఎన్నికల కమిషన్‌కు పంపించామన్నారు. ఆయన వెంట ఆర్‌ఐ వెంకటేశ్వరరావు, వీఆర్వోలు, బూత్‌లెవల్ అధికారులు, ఇతర సిబ్బంది ఉన్నారు.

మిచాంగ్ హై అలర్ట్

- మెట్ట, తీర ప్రాంతాలను అప్రమత్తం చేసిన అధికారులు
- తొండంగిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు



జగన్నాథపురంలో పనలపై ఉన్న వరిపంట



దానవాయిపేటలో సముద్ర తీరంలో పరిస్థితిని పరిశీలిస్తున్న తహసీల్దార్ సుబ్రహ్మణ్యం తదితరులు

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుపానుగా మారిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, రైతులు పంటలను ఒబ్బిడి చేసుకోవాలని, సముద్ర తీరప్రాంతాల్లో మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరిక జారీ చేశారు. శిథిల భవనాల్లో ఉండొద్దని, అవసరమైతే పునరావాసానికి తరలి వెళ్లాలని తహసీల్దార్ జి.సుబ్రహ్మణ్యం, వీఆర్వోలు, ఇతర సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

సురక్షిత ప్రాంతాలకు బోట్ల తరలింపు

మిచాంగ్ తుపాను ప్రభావంతో సముద్రతీర ప్రాంతాల్లో అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. మండలంలోని పెరుమాళ్లపురం అద్దరిపేట, కొత్తపోడిపల్లిపేట, పంపాదిపేట, వాడమురలయ్యపేట, యర్రయ్యపేట, కొత్తపేట, తాటియాకులపాలెం, దానవాయిపేట తదితర తీరప్రాంతాల్లో సముద్రంలో లంగరు వేసిన బోట్లను మత్స్యకారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అనుకూల వాతావరణం ఏర్పడే వరకూ మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని తుని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్ ఉమామహేశ్వరరావు తెలిపారు. అందరూ

రైతుల ఆందోళన

మండలంలోని ఖరీఫ్ కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ సమయంలో వర్షం కురిస్తే పంట దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వ్యవసాయ బోర్డు పరిధిలో పంటలను రైతులు ఒబ్బిడి చేసుకున్నారు. పంపా, పీబీసీ ఆయకట్టు పరిధిలో దాదాపు 8 వేల ఎకరాల్లో పంట కోత కోయాల్సి ఉంది. ఈ తుపాను గండం నుంచి గట్టెక్కించాలని దేవుడిని రైతులు కోరుకుంటున్నారు. ఆదివారం ఈదురుగాలులతో కూడిన వర్షపు జల్లులు కురిశాయి. ఈదుర గాలుల ప్రభావానికి పలు చోట్ల హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.

తొండంగిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

తొండంగి తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ జి.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఇప్పటికే తుఫాను ప్రభావిత తీర ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు తుఫాను పునరావాస భవనాల్లో తగిన సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. ఎటువంటి విపత్తులు వచ్చినా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తినా కంట్రోల్ రూమ్ నెంబర్ 9849903907కు ఫోన్ చేసి తెలపాలన్నారు.

మిచాంగ్ హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన

కోటనందూరు: మండలంలోని అనేక గ్రామాల్లో వరిపంట పక్వానికి చేరడంతో కోత కోసి కళ్లాల్లో పనలపై ఉంచారు. సోమ, మంగళవారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో ఈ ఏడాది 9 వేల ఎకరాల్లో వరి సాగు చేయగా సుమారు వెయ్యి ఎకరాల్లో పంట కోసేసి పనలపై ఉంది. మరో 4 వేల ఎకరాల్లో పంట పక్వానికి చేరి కోతకు సిద్ధంగా ఉంది. భారీ వర్షాలు కురిస్తే రైతులు భారీగా నష్టపోయే అవకాశం ఉంది.

సైన్స్‌ఫెయిర్ పోటీలు



సైన్స్ ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

తుని: స్థానిక రోటరీక్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే రంగం యువజనోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు ఆదివారం సైన్స్‌ఫెయిర్ పోటీలు నిర్వహించారు. తుని పట్టణం, రూరల్ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు 30 టీంలు పాల్గొని చక్కటి సైన్స్ ప్రదర్శనలు ఇచ్చి ప్రతిభ కనబరిచారు. ఈ కార్యక్రమానికి నాగభూషణం, మంగాదేవి జడ్జిలుగా వ్యవహరించారు. ఈ పోటీల్లో సీనియర్ విభాగంలో ప్రథమ స్థానం లయోల, ద్వితీయస్థానం గాయత్రి పాఠశాలల విద్యార్థులు సాధించారు. జూనియర్ విభాగంలో మొదటి విజేతగా పాయకరావుపేట శ్రీప్రకాష్, ద్వితీయ స్థానం తుని శ్రీప్రకాష్ పాఠశాలల విద్యార్థులు సాధించారు. విజేతలకు రోటరీ ప్రతినిధులు బహుమతులు అందజేశారు.

రైతులకు గిట్టుబాటు ధర

గండేపల్లి: మెట్ట ప్రాంతమైన గండేపల్లి మండలంలోని ధాన్యం కొనుగోలు ప్రారంభించినట్టు ఏఓ ఎ.సద్గురుమూర్తి తెలియజేశారు. సుమారు 11 ఆర్బీకే కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. రైతులు నేరుగా ధాన్యాన్ని విక్రయించవచ్చన్నారు మండలంలోని సుమారు 5118 ఎకరాల్లో వరి పంట కోతలు పూర్తయ్యాయని తెలిపారు. తుపాను ప్రభావంతో పంటలు దెబ్బతిన కుండా ముందుస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఉన్నతాధికారుల సూచనలు పాటించాలని తెలిపారు. ఇప్పటికే తహసీల్దార్లు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేస్తున్నారన్నారు.

ఐక్య గ్రాండ్ క్రిస్మస్‌ను విజయవంతం చేయండి

గోకవరం: గ్రామంలో సోమవారం జరిగే జగ్గంపేట నియోజకవర్గ ఐక్య గ్రాండ్ క్రిస్మస్‌ను విజయవంతం చేయాలని పాస్టర్ ఫెలోషిప్ జిల్లా కార్యదర్శి కన్నబాబు పిలుపునిచ్చారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గోకవరం శివారున లేఅవుట్‌లో నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్న ఐక్య క్రిస్మస్‌లో ఏపీ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు బిషప్‌ప్రతాప్‌సిన్హా, బిషప్ సజ్జాబర్నబాస్‌తో పాటు పలువురు ముఖ్యఅతిథులుగా పాల్గొంటారన్నారు. అన్ని గ్రామాల నుంచి క్రైస్తవులు తరలిరావాలని కోరారు. బిషప్ బి.రాజు, రెవరెండ్ విజయ్‌కుమార్, రెవరెండ్ జె.వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేమవరంలో నేడు గడప గడపకూ

తొండంగి: వేమవరంలో సోమవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైస్ ఎంపీపీ నాగం గంగబాబు తెలిపారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా పాల్గొంటారని, ఉదయం పది గంటల నుంచి జరిగే కార్యక్రమంలో మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

- సందడిగా కార్తిక వనసమారాధనలు
- పాల్గొన్న ప్రముఖులు



ఏలేశ్వరం వనసమారాధనలో జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్



జగ్గంపేటలో కాపుసమారాధనలో పాల్గొన్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు తదితరులు

ఏలేశ్వరం: రోజు బిజీబిజీగా గడిపే వారంతా ఒక్కచోట కలిశారు. బంధువులు, స్నేహితులతో కలిసి రోజంతా ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. అందరూ కలిసి మనసారా మాట్లాడుకున్నారు. దీంతో ఆ ప్రాంతంలో పండగ వాతావరణం నెలకొంది. దీనికి పట్టణంలోని తిరగటి రామారావు పొలం వేదికగా మారింది. కార్తికమాసం పురస్కరించుకుని పట్టణంలో ఆదివారం వనసమారాధన ఘనంగా నిర్వహించారు. వంగావీటి మోహనరంగా యూత్ ఆధ్వర్యంలో స్థానిక వైఆర్‌సీ సమీపంలోని తిరగటి రామారావు పొలంలో కాపు వనసమారాధన చేశారు. యువత, మహిళలు అధికసంఖ్యలో పాల్గొని రోజంతా ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు కూచిపూడి నృత్యం, కుర్చీలాట, క్విజ్ తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాపునేత ఉద్దగిరి సోమరాజును ఘనంగా సన్మానించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్యబాబు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో యూత్‌సభ్యులు గోళ్ల నాగేశ్వరరావు, గోపుశ్రీనివాస్, పెచ్చెటి కృష్ణ, అడపా దుర్గారావు,ఆర్ వెంకట్రావు, గోళ్ల విజయ్, సఖిరెడ్డి వంశీ, దాడిశెట్టి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం

గోకవరం: స్థానిక మండల విశ్వబ్రాహ్మణ సంఘం కార్తిక వనసమారాధన ఆదివారం ఘనంగా జరిగింది. గ్రామ శివారున గంగాలమ్మ ఆలయం సమీపంలోని పామాయిల్ తోటలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో తొలుత కేదారేశ్వర పూజ నిర్వహించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా సంఘ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి భారీగా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఐకమత్యానికి ప్రతీక వనసమారాధనలు

జగ్గంపేట: వనసమారాధనలు ఐకమత్యానికి ప్రతీకలని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. జగ్గంపేటలో కాపు కల్యాణ మండపం వద్ద ఆదివారం మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాపుల వన సమారాధనకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఉసిరి చెట్టు వద్ద పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధనలో పాల్గొన్ని భోజనం వడ్డించారు. కాపుల వన సమారాధనలో మాజీ మంత్రి తోటనరసింహం పాల్గొన్నారు. జగ్గంపేట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొత్త కొండబాబు ఆధ్వర్యంలో ఆర్య వైశ్యులు స్థానిక పామాయిల్ తోట వనసమారాధన నిర్వహించారు. అలాగే జగ్గంపేటలో వెంట్రాప్రగడ శ్రీరామూర్తి పామాయిల్ తోటలో తూర్పుకాపుల వన సమారాధన జరిగింది. ఆయా కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.




వనసమారాధనలో మహిళల సందడి



ఏలేశ్వరంలో నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్న చిన్నారులు

వెలమ వనసమారాధన



రౌతులపూడి వనసమారాధనలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు

రౌతులపూడి: స్థానిక మండల వెలమ సమాఖ్య ఆధ్వర్యంలో రౌతులపూడిలోని సరస్వతీ స్కూల్ ఆవరణలో కార్తిక వనసమారాధన జరిగింది. ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని వెలమల సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని అన్నారు. వివిధ గ్రామాలకు చెందిన పది వేల మందికి పైగా ప్రజలు వనసమారాధనలో పాల్గొన్నారు. రాష్ట్ర నవరత్నాలు అమలు కమిటీ డిప్యూటీ చైర్మన్, రాష్ట్ర గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు అంకంరెడ్డి నారాయణమూర్తి, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ లెక్కల నాయుడుబాబు, ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, మాజీ ఎమ్మెల్సీ గేదెల శ్రీనివాస్, స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, మాజీ అన్నవరం ట్రస్టు బోర్డు డైరెక్టర్ వాసిరెడ్డి జమీలు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు, నాయకులు పాల్గొన్నారు.

సత్యదీక్ష భక్తుల పాదయాత్ర

ప్రత్తిపాడు రూరల్: సత్యదీక్ష చేపట్టిన భక్తులు మండలంలోని ధర్మవరం నుంచి అన్నవరం రత్నగిరికి ఆదివారం పాదయాత్రగా తరలివెళ్లారు. 50 మంది సత్యదీక్ష భక్తులు స్థానిక విజయదుర్గ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నవరానికి బయలుదేరారు. రత్నగిరికి చేరుకొని సత్యదేవుడుని దర్శించుకొని దీక్షను విరమించి మొక్కులను చెల్లించుకొన్నారు.

మళ్లీ జగనే రావాలని పాదయాత్ర



పాదయాత్ర బృందానికి జగ్గంపేటలో స్వాగతం పలికిన వైఎస్సార్ సీపీ నేతలు

ప్రత్తిపాడు/జగ్గంపేట: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని కోరుతూ విశాఖపట్నం నుంచి తిరుపతికి వైఎస్సార్ అమరజ్యోతి స్టూడెంట్స్ యూత్ ఫోరం అధ్యక్షుడు గాలి గణేష్ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర ఆదివారం ప్రత్తిపాడు జాతీయ రహదారి వద్దకు చేరుకుంది. ఈ పాదయాత్రకు స్థానిక నాయకులు స్వాగతం పలికారు. అలాగే జగ్గంపేట వద్ద వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, వైఎస్సార్ సీపీ నేతలు స్వాగతం పలికి, పూలమాలలతో సత్కరించారు. అనకాపల్లి జిల్లా రావికమతం మండలం కొత్తపట్నం గ్రామానికి చెందిన గాలి గణేష్ మాట్లాడుతూ తాను గతంలో విశాఖ నుంచి ఇడుపులపాయ వరకూ పాదయాత్ర చేశానన్నారు. ప్రస్తుతం రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అఖండ విజయం సాధించాలని కోరుతూ పాదయాత్ర చేపట్టామన్నారు.